క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండతండాలో బోగుబండారు ముత్యాలమ్మకు ఆదివారం లంబాడీలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకొని బంజార సాంప్రదాయ ప్రకారంగా పండుగను నిర్వహించారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామ్‌లాల్, మాజీ ఉప సర్పంచ్ రవినాయక్, భాస్కర్, గోపాల్, దశరథం, లాల్, హార్యా పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహను ఆదివారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంద్రకంటి శేఖర్ శాలువా, మెమొంటోతో సన్మానం చేశారు. త్వరగా వ్యవసాయ మార్కెట్‌ను ప్రారంభించి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు మల్లేష్, కృష్ణంరాజు, రాజల్‌గౌడు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



చారకొండ: మండల కేంద్రంలో పీర్ల పండగను ఆదివారం కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల చావడి ఎదుట నిర్వాహకులు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి అగ్నిగుండం చుట్టు గ్రామస్తులు, యువకులు అలయ్ బలయ్ ఆడారు. పీర్లకు గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు, దట్టీలు సమర్పించారు. గ్రామంలో పీర్లను పురవీధుల గుండా డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. పీర్లకు ఊదు బెల్లం, కానుకలు చెల్లిస్తు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెల్ల రాముగౌడ్,గుండె సైకిలాబ్ గౌడ్, జెల్ల వెంకటయ్య గౌడ్, గెండె వెంకటయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి



తెలకపల్లి: యువ వైజ్ఞానిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగపూర్ మధు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆగస్టు10, 11 తేదీలలో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలపై చర్చ ఉంటుందన్నారు. జిల్లా నాయకులు ఎన్నుపోతుల కుర్మయ్య, రాధిక, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పోలేపల్లి గ్రామానికి ఎల్లికంటి శంకర్ 10 రోజుల కిందట గుండెపోటులో మృతిచెందాడు. దీంతో తోటి మిత్రులు డబ్బులను పోగు చేసుకొని బాధిత కుటుంబానికి రూ.36 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పరశురాములు, నిరంజన్, రామకృష్ణ, దేవయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తెలకపల్లి: మండలంలోని అనంతసాగర్‌లో మోడంపల్లి ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణం కోసం గట్టురాయిపాకుల గ్రామానికి మాజీ ఎంపీటీసీ సభ్యుడు యాతం బాలయ్య రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. ఆదివారం అతని కుమారుడు చక్రవర్తి జన్మదినం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని, భక్తి మార్గం ఉండాలన్నారు.



తాడూరు మండలం పొల్మూర్‌కు వెళ్లే దారి



అచ్చంపేట-ఉప్పునుంతల రోడ్డులో బురదమయంగా ఉండటంతో పక్కనుంచి వెళ్తున్న వాహనాలు

రోడ్లు ఇలా వెళ్లేదెలా?



లింగాల మండలంలోని అంబట్‌పల్లిలో అంతర్గత రోడ్డు

నాగర్‌కర్నూల్ జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. పలు మండలాల్లో మట్టిరోడ్లు బురదమయంగా మారాయి. అడుగుతీసి అడుగువేయలేని దుస్థితి నెలకొంది. అచ్చంపేట-ఉప్పునుంతల ప్రధాన రహదారి బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆటోలు, ద్విచక్రవాహనదారులు వెళ్లేందుకు జంకుతున్నారు. బురదలో వాహనాలు ఇరుక్కొని నానా అవస్థలు పడుతున్నారు. తాడూరు మండల కేంద్రంలో 2వ వార్డులో రోడ్లపై నాచు దర్శనమిస్తోంది. తాడూరు ఆస్పత్రి ఆవరణంలో పరిసరాలు బురదమయంగా ఉండటంతో ఆస్పత్రికి వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ప్రధాన గేటు ఎదుట బురదతో ఉండటంతో రోగులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

- అచ్చంపేట/తాడూరు/లింగాల



తాడూరులో 2వ వార్డులో బురదమయంగా రోడ్డు



కోడేరు నుంచి ఖానాపూర్ వెళ్లే దారి..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి సేవలు అందించారని వక్తలు కొనియాడారు. ఆయన సేవలను దేశం ఎప్పటికి మరిచిపోదన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు ప్రదీప్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపిగౌడ్, నాయకులు రజాక్, రఫీక్, స్వామీ, వెంకటేష్, లక్ష్మణ్, సైఫ్, ప్రశాంత్, శేఖర్, నర్సింహ్మా, శివ,సందానీ, హాతిక్, శ్రీను, కుర్మయ్య, శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

చారకొండ/వెల్దండ:జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు పలుస విజయ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పగడాల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర రామకృష్ణ, కోశాధికారిగా నల్లా కిరణ్, ఉపాధ్యక్షుడుగా పల్లే వెంకటయ్య, ఎన్నుకున్నారు. అదేవిధంగా వెల్దండలో కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మిరియాల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొమ్మిశెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా పూరి రమేష్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణతో కార్యవర్గ సభ్యులుగా నరసింహ, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జహీర్, కార్యదర్శిగా రాజన్న, ఉపాధ్యక్షుడిగా రెహమాన్, కోశాధికారిగా బాల్ జంగయ్యలు ఎన్నికయ్యారు.

ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ అరికట్టాలి

మన్ననూర్: ప్రైవేటు ఆస్పత్రులలో కన్సల్‌టేషన్ ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు సంబు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి విద్య, వైద్యానికి ఆశించిన స్థాయిలో ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తే అభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న సబ్సిడీలు ఆ పూట గడువడానికే సరిపోతుండగా వ్యాధి వస్తే తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. పేదలకు ప్రైవేటు ఆస్పత్రులలో రాయితీ కల్పించే ఏర్పాట్లు ప్రభుత్వం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ దిశగా అధికారులు సమాలోచనలు చేసి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తాం

చారకొండ: స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తామని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాయి మహరాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సురేష్ మహరాజ్, వెంకటేష్, ఉన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ

బిజినేపల్లి: వనపర్తి జిల్లా నుంచి బిజినేపల్లి మీదుగా ఆదివారం కొనసాగిన బైక్ ర్యాలీలో బీ జేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా లో మహనీయుల విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి బైక్‌ర్యాలీ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు, దిలీపాచారి, రాములు, భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌మారథాన్‌లో నల్లమల విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న బీనమోని మధుప్రియ

అమ్రాబాద్: పదర మండల కేంద్రానికి చెందిన బీనమోని మధుప్రియ ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆఫ్‌మారథాన్ పోటీలలో పాల్గొని ఐదు కిలోమీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానంలో నిలిచి రజతపతకం సాధించింది. ప్రస్తుతం కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం చదువుతున్న మధుప్రియ నల్లగొండ జిల్లా డిండి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల క్రీడా అకాడమీలో కోచ్ పరశురాముడు వద్ద అథ్లెటిక్‌లో శిక్షణ పొందుతోంది.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం పూర్తి

పెద్దకొత్తపల్లి: ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇంటి నిర్మాణం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పూర్తయినట్లు ఎంపీడీఓ నాగేంద్రం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిబంధనల ప్రకారం లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. నిబంధనల ప్రకారం నిర్మించుకున్న వారికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని తెలిపారు. మండలంలో 646 ఇళ్ల మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. చంద్రబండతండా మోడల్ విలేజ్‌లో 21 ఇళ్లకుగాను 10 ఇండ్లు నిర్మాణాలు పూర్తి దశకు చేరుకుందని వివరించారు. మిగతా 11 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పెంట్లవెల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మండలం అభివృద్ధికి నోచుకోలేదని వి మర్శించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్య శ్రీ పెంపు, రైతు భరోసా, రుణమాఫీ పథకాలు అమలు చేసిన ఘటన కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రామన్‌గౌడ్, నల్లపోతుల గోపాల్, ఎర్రశ్రీ ను, నర్సింహనాయుడు,మూలెకుమార్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో హక్కుల సాధన



కల్వకుర్తి రూరల్: బీసీలు ఐకమత్యంతో హక్కుల సాధన కోసం పోరాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని మార్చాలలో ఆదివారం బీసీ సంఘం నాయకులు బీసీ కమ్యూనిటీ హాలులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 42 శాతం ఉన్న బీసీలు సామాజిక రాజకీయ ఆర్థిక రంగాలలో రాణించాలన్నారు. రాబోయే ఎన్నికలలో సత్తా చాటాలని నాయకులు పిలుపునిచ్చారు.

దేశవ్యాప్తంగా మన్ కీ బాత్‌కు ఆదరణ

కల్వకుర్తి రూరల్: దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ ఆదరణ లభిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీనగర్ కాలనీలో బూత్ అధ్యక్షుడు బాలరాజు ఆధ్వర్యంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీధర్ నివాసంలో ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. పట్టణంలోని విద్యావంతులు, యువత పార్టీ వైపు చూస్తున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు గన్నోజు బాబీ దేవ్, సీనియర్ నాయకుడు గుర్రాల రాంభూపాల్ రెడ్డి, గంగాధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు: ఇద్దరికి తీవ్రగాయాలు



దోమలపెంట: అమ్రాబాద్ మండలం నల్లమలలోని శ్రీశైలం రహదారిలో ఆదివారం ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఎస్ఐ ఎస్ఐ కె.జయన్న పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలానికి 7మంది కారులో వెళ్తున్నారు. మార్గమధ్యలో బ్రహ్మగిరి సమీపంలో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజు, మిన్నుగౌడ్ తీవ్రంగా గాయపడ్డారు. కావలి సిద్దు, వడ్డి వికాస్, కావలి ఆదిత్య, గోపి, సంకీర్త్‌లకు స్వల్ప గాయాలయ్యారు. చికిత్స నిమిత్తం అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిగా మెరుగైన వైద్యం కోసం తరలించారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతర కు భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం 6 వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం కారణంగా జాతరలో భక్తులు లేకపోవడంతో తినుబండారాలు గుడారాలు వెలవెలబోయాయి. ఆర్టీసీ బస్సులు జనం లేక ఖాళీగా నడిచాయి.

నలుగురిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి-యాపట్ల మార్గంలో ఆదివారం పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహాసభల పోస్టర్లు విడుదల

కొల్లాపూర్: కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1, 2 తేదీలలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లను ఆదివారం కొల్లాపూర్‌లో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి యూసూఫ్ విడుదల చేసి మాట్లాడారు. మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు బాల్‌నర్సింహ, ఫయాజ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నలు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్, ఖాజామైనోద్దీన్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

కొల్లాపూర్: మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బెవిని ధర్మయ్య కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

నేడు రేషన్‌కార్డులు పంపిణీ

అచ్చంపేట రూరల్: నూతనంగా లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను సోమవారం పట్టణంలోని బీకే ఫంక్షన్ హాలులో పంపిణీ చేయనునట్లు మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

అమ్రాబాద్: అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్(బీకే)లో రేణుక ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వలపట్ల శిరీష, తిరుమలేష్ దంపతులు ధ్వజస్తంభానికి రూ.2.30 లక్షలు విరాళంగా ఇచ్చారు. పూజారులు శివ, వెంకటయ్యల వేద మంత్రాలతో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగాయి.

గద్దర్ జీవితం స్ఫూర్తిదాయకం



కల్వకుర్తి రూరల్: గద్దర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేయనున్న గద్దర్ విగ్రహానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఆగస్టు 10న విగ్రహావిష్కరణ చేస్తునట్లు విగ్రహ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు లక్ష్మణ శర్మ, శేఖర్, సుధాకర్, జగన్, జంగయ్య, రేణుక పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఎదగాలి

వెల్దండ: యువత స్వయం ఉపాధితో ఎదగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. మండలం బొల్లంపల్లి అడ్డరోడ్డు వద్ద నూతనంగా నిర్మించి ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడు, పర్వత్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, మాజీ ఎంపీపీ జయప్రకాష్, ఉన్నారు.

మాజీ మంత్రులకు ఘన స్వాగతం



తిమ్మాజిపేట: ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థకు గురైన విద్యార్థునులకు పరామర్శించేందుకు నాగర్‌కర్నూల్ వెళ్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డిలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, గువ్వల బాల్‌రాజ్‌లను మార్గమధ్యలో తిమ్మాజిపేటలో ఆపార్టీ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు ప్రదీప్, నాయకులు గోపిగౌడ్, స్వామి, రజాక్, రఫీక్, వెంకటేష్, లక్ష్మన్, సైఫ్, ప్రశాంత్, శేఖర్, శివ, శ్రీను, కుర్మయ్య, శ్రీరాం, వెళ్లిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రం శివారులో ఉన్న మహాత్మాజ్యోతిరావుపూలే విద్యాలయంలో శనివారం రాత్రి భోజనంలో ఫుడ్ పాయిజన్ కారణంగా 68 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్‌నర్సింహ ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాణ్యతలేని సరుకులను పంపించిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సర కాలంలో ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటనలు నాలుగోసారి చోటుచేసుకుందని రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. గురుకులాలను ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. మరోసారి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర సమితి సభ్యుడు వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీసీ గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి దాదాపు 80 మంది విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను వారు పరామర్శించారు. నాసిరకం భోజనం, గడువు ముగిసిన పెరుగును అందిస్తున్నారని ఆరోపించారు. పారదర్శంగా విచారణ చేసి చర్యలు చేపట్టాలని కోరారు.



విద్యార్థినులను పరామర్శిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం బాల్‌నర్సింహ

విద్యార్థినులకు పరామర్శ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలో చికిత్సపొందుతున్న విద్యార్థులను సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆనంద్‌జీ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ పరామర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసు, కందికొండ గీత , జిల్లా కమిటీ సభ్యులు పొదిలి రామయ్య విద్యార్థినులను పరామర్శించి ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామస్వామి, అభిలాష్, విగ్నేష్, లక్ష్మణ్ , సీపీఎం నాయకులు తారాసింగ్ నాగపూర్ మధు కురుమయ్య అంజనేయులు పాల్గొన్నారు.